మహాసభలను జయప్రదం చేయండి

మణికొండ: తుర్కయంజాల్‌లో ఈ నెల 14,15 తేదీలలో నిర్వహించే మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయు 5వ మహాసభ వాల్ పోస్టర్‌లను శనివారం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీ కేంద్రాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నార్సింగి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహిపాల్, మణికొండ యూనియన్ నాయకులు రమ, మనీలాలు మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మహాసభను నిర్వహిస్తున్నారన్నారు. మహాసభకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై తమ హక్కుల సాధనతో పాటు సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు జనార్ధన్‌రెడ్డి, లక్ష్మీరాణి, మహేందర్, చందు, రామచంద్ర, శ్రీధర్, రాములు, సుకన్య, సత్యనారాయణ, రవి, లలిత, చంద్రకళ, దివ్య పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

శంషాబాద్: రెండు రోజులుగా కొనసాగుతున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో మినీ స్టేడియంలో నిర్వహించిన అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధాన విజేతలుగా చిన్నగొల్కొండ, పెద్దషాపూర్, తొండుపల్లి, పాలమాకుల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిలిచారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శంషాబాద్ కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన



ఈవీఎం గోడౌన్‌ను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ఈవీఎంల గోడౌన్‌ను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎంల గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. రాజేంద్రనగర్ తహసీల్దార్, వేర్ హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ కుమారుడు అశోక్‌ను ఆ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నాయకులు శనివారం పరామర్శించారు. డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లి పరిశీలించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాబుల్‌రెడ్డినగర్ కాలనీ నేతలు పూజారి నర్సింహ, నామాల రాము, సునీల్, సింహాద్రి, అశోక్ కుమార్, పూజారి అర్జున్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



విజయలక్ష్మి

మణికొండ: నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... జీవనోపాధి కోసం మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కోకాపేటకు చెందిన విజయలక్ష్మి(25) తన భర్త ఆంజనేయులుతో కలిసి సబితానగర్‌కు వచ్చి నివసిస్తుంది. ఈ నెల 7వ తేదీన భర్త ఉదయం పనికి వెళ్లే సమయంలో ఇంట్లోనే ఉంది. సాయంత్రం తిరిగి వచ్చి చూసే సరికి ఆమె కనిపించలేదు. అదే విషయాన్ని ఆంజనేయులు తన అత్త అనసూయకు తెలిపాడు. పలు ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేక పోవటంతో అనసూయ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విజయలక్ష్మి సమాచారం ఎవరికైనా తెలిస్తే నార్సింగి పోలీస్ స్టేషన్ ఫోన్: 94910 39034లో సమాచారం ఇవ్వాలని కోరారు.

కబ్జాదారుల్లో 'హైడ్రా' దడ!

బండ్లగూడ జాగీర్‌లో ఆక్రమణల చెరలో పార్కుల స్థలాలు

- స్వాధీనం చేసుకున్న హైడ్రా అధికారులు
- 6600 గజాల రెండు స్థలాల విలువ రూ. 46 కోట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



హైడ్రా స్వాధీనం చేసుకున్న సన్‌సిటీలోని పార్కు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో హైడ్రా అధికారులు ఆక్రమణలకు గురైన పార్కు స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి గట్టి బందోబస్తు మధ్య సుమారు రూ. 46 కోట్ల విలువ గల 4,600 గజాల పార్కు స్థలాన్ని శనివారం స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేశారు. కాలనీ సభ్యుల ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం సన్‌సిటీలోని పి అండ్ టీ కాలనీ డి బ్లాక్ సర్వే నెంబర్ 96/2, 96/3లోని రూ. 20 కోట్ల విలువ గల 2,000 గజాల పార్కు స్థలం కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేశారు.

పద్మశ్రీ హీల్స్‌లో రూ. 26 కోట్ల విలువైన పార్కు స్థలం..

పద్మశ్రీ హీల్స్ కాలనీలో గతంలో లేఅవుట్ వేసినప్పుడు సర్వే నెంబర్ 97లో 2,600 గజాల స్థలాన్ని పార్కు కోసం వదిలేశారు. గతంలో మున్సిపల్ అధికారులు రెండు వైపులా గోడ కట్టారు. తరువాత అక్కడి పార్కులో మూడో వైపు పని చేయడానికి యత్నించగా కొందరు అక్రమార్కులు అడ్డుకున్నారు. మున్సిపల్ అధికారులను కూడా అక్కడికి రానీయలేదు. శుక్రవారం రాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు పార్కులో ఉన్న బెంచిలను సైతం ధ్వంసం చేశారు. అక్రమార్కుల కబ్జా విషయపై కొన్ని రోజులుగా పద్మశ్రీ హిల్స్ కాలనీ వాసులు, సీనియర్ సిటిజన్లు హైడ్రా ఆధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన హైడ్రా ఆధికారులు పోలీసుల సాయంతో బందోబస్తు మధ్య సుమారు రూ. 26 కోట్ల విలువ చేసే 2,600 గజాల పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేయడంతో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.



పద్మశ్రీ హీల్స్‌లో హైడ్రా స్వాధీనం చేసుకున్న పార్కు స్థలం

బొటానికల్ గార్డెన్‌కు పూర్వ వైభవం



బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటుతున్న వలంటీర్లు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని బొటానికల్ గార్డెన్‌కు విద్యార్థులు, వర్సిటీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంలో పూర్వ వైభవం తీసుకొస్తున్నారు. వ్యవసాయ వర్సిటీలోని 46 ఎకరాలలో ఉన్న బొటానికల్ గార్డెన్ ఒకప్పుడు కళకళలాడేది చాలా వరకు ప్రముఖ తెలుగు చలన చిత్రాలు తీసేవారు. ప్రముఖ నటులైన కమలహాసన్, సావిత్రి, వాణిశ్రీ, విజయశాంతి, అలనాటి ఎన్టీఆర్, ఏఎన్ఆర్ లాంటి అగ్ర నటులు ఇక్కడ సినిమాలు తీశారు. దీంతో పాటు ఎంతోమంది పీజీ పీహెచ్‌డీ విద్యార్థులు, శాస్త్రవేత్తలు ఎన్నో రకాల పరిశోధనలు చేశారు. అలాంటి బొంటానికల్ గార్డెన్ గత 15 సంవత్సరాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. పూర్తిగా మూసి వేయబడింది. దీనిని గుర్తించిన ప్రస్తుత వర్సిటీ యాజమాన్యం పూర్వ వైభవం తీసుకురావడానికి నడుం బిగించింది. గత నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎండీఏ సహకారంతో అదే రోజు 1500 రకాల మొక్కలు నాటారు. ప్రస్తుతం ప్రముఖ స్వచ్ఛంద సంస్థ నార్మాన్, సీఎస్సార్ సహకారంతో శనివారం 10 వేల మొక్కలు నాటే కార్యక్రమం చెప్పాటారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్, ఉన్నతాధికారులు, ఆగ్రో ఫారెస్ట్రీ విభాగం అధికారులు, ఆర్పిజీయం ప్రతినిధులు, మణిదీప, సుజిత, నార్మాణ్ సంస్థ ప్రతినిధులు, మయూర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎంఈవో శంకర్ రాథోడ్ తదితరులు

విజేతలకు బహుమతుల ప్రదానం

రాజేంద్రనగర్: శివరాంపల్లి పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఈ పోటీల్లో గెలుపొందిన విజేత జట్లులకు ఎంఈవో శంకర్ రాథోడ్, జీహెచ్‌ఎం భూక్య శ్రీను నాయక్, ఆదర్శ విద్యాలయ చైర్మన్ శ్రవణ్ కుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి, జోనల్ స్థాయి సెక్రటరీ గాంగ్య నాయక్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 210 టీమ్‌లు వివిధ క్రీడాలలో పాల్గొన్నారు. క్రీడలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జోనల్ స్థాయికి ఎంపిక చేశారు. జోనల్ స్థాయి పోటీలు ఆదివారం నుండి శివరాంపల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో జరుగుతాయని జోనల్ సెక్రటరీ గాంగ్య నాయక్ తెలిపారు. మండలంలోని వివిధ సంఘాల నాయకులు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు కడుమూరి సుదర్శన్, ఎస్‌టీయూ అధ్యక్షుడు కామిశెట్టి వెంకటయ్య, యూటీఎఫ్ అధ్యక్షుడు యాదగిరి, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్దన చారి, పీడీలు జ్యోతి, రంగారెడ్డి, బాలస్వామి రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

సైబర్ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్



మారుతీనగర్‌లో పర్యటిస్తున్న ఎస్ఈ తదితరులు

మణికొండ: కాలనీలు, మున్సిపాలిటీలలో ఉన్న విద్యుత్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ సైబర్ సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మారుతినగర్ కాలనీలో డీఈ రమేష్‌చంద్రతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు విద్యుత్ లో వోల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనెక్షన్‌లు పెరిగినా ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యం పెంచక పోవటంతో సమస్య వస్తుందని వివరించారు. దాంతో ఆయన కాలనీలోని రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ వైర్లకు తగులుతూ ఉన్న చెట్ల కొమ్మలను ఎప్పటికపుడు ఎందుకు తొలగించలేదని అధికారులను ప్రశ్నించారు. వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రతి కాలనీలో ఇదే తరహాలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మణికొండ ఏఈ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ రూరల్: రహదారి విస్తరణ పనులతో రేగుతున్న దుమ్ముతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శంషాబాద్-షాబాద్ మార్గంలో నర్కూడ శివారు నుంచి శంషాబాద్ వరకు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. అమ్మపల్లి దేవాలయం నుంచి నర్కూడ వరకు అసంపూర్తిగా ఉండడంతో రోడ్డుపై దుమ్ము రేగుతోంది.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

గోల్కొండ: సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ చౌరస్తా వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి తమ పార్టీ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని అందులో భాగంగానే ప్రజా దర్బార్, ఇంటింటికీ మజ్లిస్ లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా టోలిచౌకీ పరిసరాలకు చెందిన పలువురు తమ తమ సమస్యలను ఆయనకు తెలిపారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు ఆరూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, మజీద్ ఖాన్ తదితరులున్నారు.

పాలకులకు బీసీలు గుణపాఠం చెప్పటం తథ్యం

మణికొండ: చట్ట పరంగా చెల్లుబాటుకాని రిజర్వేషన్‌లను హడావిడిగా తెచ్చి కోర్టులలో కొట్టివేసేలా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, అసెంబ్లీలో చేసిన చట్టాన్ని అమలు పర్చకుండా గవర్నర్ వద్ద పెండింగ్‌లో పెట్టిన బీజేపీలకు బీసీలు తగిన గుణపాఠం చెప్పడం తథ్యమని బీఆర్‌ఎస్ మణికొండ మున్సిపాలిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మణికొండలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్ ఆధ్వర్యంలో బీసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 50 శాతం మించకుండా చేయాల్సిన రిజర్వేషన్ల అమలును తుంగలో తొక్కి కొత్తగా బీసీలకు తెచ్చిన 42 శాతం రిజర్వేషన్లు కోర్టులలో నిలవవనే విషయం ప్రభుత్వ పెద్దలకు తెలుసన్నారు. కేవలం ప్రజలను, బీసీలను మభ్యపెట్టేందుకే ఇలాంటివి అమలు చేశారన్నారు. ప్రభుత్వ తీరుతో బీసీలంతా మనోవేదనకు గురవుతున్నారని, వారంతా తిరగబడి జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. నాయకులు ఎ. లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, బాబు, ఆదిత్య, శివ పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో బస్సు (ఏపీ29జెడ్9206) శనివారం సాయంత్రం బాబుల్‌రెడ్డినగర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ సమయంలో ముందు వెళ్తున్న ఆటో (టీఎస్07యూజే5926) స్పీడ్‌గా వెళ్లి ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసింది. దీనిని గమనించకుండా ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెనుక నుంచి ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు అద్దాలు పగిలిపోయాయి. అలాగే బస్సులోని కండక్టర్ అనిల్‌కుమార్‌తో పాటు లక్ష్మీగూడ గ్రామానికి చెందిన అలివేలుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

సమాజ సేవ కోసం గ్రామబాట

గోల్కొండ: సమాజ సేవ కోసం తమ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ గ్రామబాట పట్టిందని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీలక్ష్మి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హుమేరా సైయిద్‌తో కలిసి ఆమె శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి సేవా కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహిస్తామని విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..మన్‌సాన్‌పల్లిలో ఈ నెల 14వ తేదీ వరకు ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. స్థానికులతో కలిసి గ్రామం మొత్తంలో మొక్కలు నాటుతామన్నారు. అదే విధంగా పరిశుభ్రత, ఆరోగ్యం అనే అంశంపై స్థానికులకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తామన్నారు.

అప్పులు.. చదువుకోననే కొడుకు వైఖరితో..

ఆత్మహత్య చేసుకుంటానంటూ వ్యక్తి అదృశ్యం



శ్రీనివాస్

శంషాబాద్ రూరల్: అప్పులు తీర్చే మార్గలేక.. కొడుకు చదువుకోవడానికి హాస్టల్‌కు వెళ్లనంటూ మారాం చేయడంతో మనోవేదనకు గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... పిల్లోనిగూడకు చెందిన పానుగంటి శ్రీనివాస్(40) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న ఇతని కొడుకు కిశోర్ దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. ఈ నెల 10న శ్రీనివాస్ తిరిగి హాస్టల్‌కు కొడుకును తీసుకుని వెళ్లగా.. అక్కడ ఉండనంటూ కిశోర్ ఏడ్వడంతో ఇంటికి తీసుకొచ్చాడు. సోదరుల వద్ద తీసుకున్న అప్పు కట్టడానికి డబ్బులు లేవంటూ.. కొడుకు హాస్టల్‌లో ఉండటం లేదనే బాధతో శ్రీనివాస్ అదే రోజు రాత్రి బాధ పడ్డాడు. తాను చనిపోతానని ఇంట్లో తాడు తీసుకుని పొలానికి బయలుదేరాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని వారించినా వినకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బు కోసం వ్యక్తిని వేధించిన మాజీ కార్పొరేటర్ అరెస్టు

- ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు డిమాండ్
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితుడు
- మాజీ కార్పొరేటర్‌కు టీపీఓ వత్తాసు
- మాజీ డిప్యూటీ మేయర్ వద్ద రూ. 4 లక్షలు చెల్లింపు
- అయినా ఆగని వేధింపులతో పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి

మణికొండ: తాను కొనుగోలు చేసిన స్థలంలో ఇంటిని నిర్మించుకుంటున్న ఓ వ్యక్తిని మాజీ కార్పొరేటర్ ఏకంగా రూ. 10 లక్షలు డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని బతిమాలినా వినిపించుకోకుండా డబ్బులు ఇవ్వకపోతే లోపల వేసి కొడతానని బెదిరించాడు. మాజీ కార్పొరేటర్ అడిగింది ఇచ్చి సమస్య తీర్చుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారి(టీపీఓ) పలు మార్లు నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లి మరో వైపు వేధించాడు. వాటిని తాళలేక స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను బాధితుడు ఆశ్రయించాడు. ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ మేయర్‌కు సిఫారసు చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మాజీ డిప్యూటీ మేయర్ ఇంట్లో పంచాయతీ పెట్టి చివరకు రూ. 4 లక్షలు చెల్లించాడు. అయినా వేధింపులు ఆగక పోవటంతో బాధితుడు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డితో పాటు అతని అనుచరుడు సందీప్‌రెడ్డిలను అరెస్టు చేశారు. బాధితుడు నానాజీ శనివారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం... ఓ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ హైదర్‌షాకోట్‌లో 100 గజాల పాత ఇంటిని ఇటీవల కొనుగోలు చేశానన్నారు. పాత ఇంటిని తొలగించి కొత్త ఇంటి నిర్మాణం చేపడుతుండటంతో మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. తను కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపడితే డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించానన్నాడు. దాంతో మాజీ కార్పొరేటర్ టీపీఓ రాకేష్‌కు చెప్పి పనులను పలుమార్లు నిలుపుదల చేయటం, నిర్మాణ సామగ్రి తీసుకెళ్లి వేధించారన్నారు.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు..

తన స్థలంలో తను ఇంటి నిర్మాణం చేస్తుంటే మాజీ కార్పొరేటర్ వేధిస్తున్నాడని బాధితుడు నానాజీ ఇటీవల ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. దాంతో ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డికి ఫోన్ చేసి అతన్ని వేధించవద్దని మాజీ కార్పొరేటర్‌కు చెప్పాలని సూచించాడు. అయినా మాజీ కార్పొరేటర్ పట్టు వీడకుండా టీపీఓతో కలిసి వేధించటంతో మాజీ డిప్యూటీ మేయర్ ఇంట్లో ఇటీవల సమావేశం అయి మాజీ కార్పొరేటర్‌కు చివరకు రూ. 3 లక్షలు నగదుగా, రూ. లక్ష ఆన్‌లైన్‌లో చెల్లించాడు. సమస్య తీరిందని అనుకున్నా తనను వదలకుండా మరో మారు డబ్బులు ఇవ్వాలని వేధించటంతో శుక్రవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు. ఫిర్యాదులో మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి, అతని అనుచరుడు సందీప్‌రెడ్డి, టీపీఓ రాకేష్‌లు వేధించినట్టు పేర్కొన్నానని బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం మాజీ కార్పొరేటర్, అతని అనుచరున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సమాచారం. టీపీఓ పాత్రపైన విచారణ చేస్తున్నట్టు తెలిసింది. ఈ కేసు విషయమై నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

వాహనదారులకు శాపం!



హిమాయత్‌సాగర్-ఓఆర్ఆర్ సబ్ రోడ్డు బంద్ చేసి నెలవుతున్నా...

- ఇంకా మరమ్మతు పనులను ప్రారంభించని అధికారులు
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

రాజేంద్రనగర్: వరద కారణంగా మరమ్మతులకు గురైన హిమాయత్‌సాగర్-ఓఆర్ఆర్ సబ్ రోడ్డు నిర్మాణ పనులు అటకెక్కాయి. రోడ్డును మూసివేసి నెల రోజులు అవుతున్నా... పనులు ముందుకు సాగడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జులై చివరి వారం నుంచి పెద్ద ఎత్తున వరదనీరు హిమాయత్ సాగర్‌లోకి వచ్చి చేరడం ప్రారంభించాయి. నిండు కుండలా మారడంతో ఆగస్టు మొదటి వారంలో వరదనీటిని దిగువకు వదిలారు. ఆగస్టు 9వ తేదీ నుంచి శంషాబాద్, రాజేంద్రనగర్ నుంచి సబ్ రోడ్డు గుండా అప్పా జంక్షన్‌కు వెళ్లే రహదారిని మూసివేశారు. వరదనీటి కారణంగా ఎలాంటి ప్రమాదం జరగకుండా ఈ చర్యలు తీసుకున్నారు. కాగా వరదనీటి కారణంగా బ్రిడ్జిపై వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. గోతులమయంగా మారిన రోడ్డు ప్రమాద భరితంగా తయారైంది. దీంతో ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఎండీఏ, బండ్లగూడ కార్పొరేషన్, జలమండలి, ట్రాఫిక్ పోలీసులు ఈ రోడ్డును పరిశీలించి నెల క్రితం మరమ్మతులు చేయాలని మూసివేశారు. దీంతో రాజేంద్రనగర్, శంషాబాద్ నుంచి వచ్చే వాహనదారులు అప్పా జంక్షన్‌కు వెళ్లే దారి లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఈ ప్రాంతంలో ఎలాంటి రోడ్డు లేదు. ఓఆర్ఆర్‌పై నుంచి కేవలం కార్లను మాత్రమే అనుమతిస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాజేంద్రనగర్, బుద్వేల్, కిష్టమ్మగుట్ట, కిస్మత్‌పూర్ మీదుగా ఈ ప్రాంతం నుంచి వాహనాలను మళ్లిస్తున్నారు. ఈ రోడ్డు దాదాపు 10 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నెల రోజులు అవుతున్నా..

ఆర్‌అండ్‌బీ శాఖ మరమ్మతులను చేసేందుకు రోడ్డును మూసివేసి ఇరువైపుల బారికేడ్లను ఏర్పాటు చేసింది. పనులను నిర్వహిస్తున్నారని అందరూ భావించినా ఇప్పటి వరకు ఎలాంటి పనులను ప్రారంభించలేదు. శాఖల మధ్య సమన్వయం లోపంతో ఈ సమస్య నెలకొందని అధికారులు వెల్లడిస్తున్నారు. రోడ్డు మూసి నెల అవుతున్నా... పనులను ప్రారంభించకపోవడం పట్ల వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎండీఏ, ఆర్‌అండ్‌బీ శాఖల మధ్య సమన్వయం కొరవడంతో ఈ సమస్య నెలకొంది.

ఎలాంటి సూచికలు లేకపోవడంతో...

నగరంతో పాటు నగరు శివార్ల నుంచి ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు చేవెళ్ల, బీజాపూర్ జాతీయ రహదారి వైపు వెళ్లేందుకు హిమాయత్‌సాగర్ ఔటర్ రోడ్డు సర్వీసు రోడ్డును ఉపయోగిస్తున్నారు. వీరంతా శంషాబాద్, రాజేంద్రనగర్ మీదుగా సర్వీసు రోడ్డు వద్దకు వస్తారు. రోడ్డు మూసి వేసి ఉండటంతో దారి తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. అటు శంషాబాద్... రాజేంద్రనగర్ వైపు ఉన్న రహదారిని మూసివేశారని ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు సర్వీసు రోడ్డు వరకు వెనుతిరగాల్సి పరిస్థితి నెలకొంది. స్థానికంగా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేసి ఉంటే ఈ సమస్య కొంతనైనా తీరనుందని వాహనదారులు తెలుపుతున్నారు.